మాకే ఓటు ఎందుకంటే.?

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో ప్రజలు మీకు ఎందుకు ఓటు వేయాలి అన్న విషయంపై ప్రధాన పార్టీ అభ్యర్థులను 'సాక్షి'పలకరించగా వారు ఈ విధంగా ప్రస్తావించారు. స్వతంత్ర అభ్యర్థులు సైతం తమకు అవకాశం కల్పిస్తే సేవ చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు తమకు అవకాశం కల్పిస్తే అభివృద్ధి, మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

వేలాది కోట్లతో అభివృద్ధి చేపట్టా..

కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్



తొమ్మిదిన్నర సంవత్సరాల్లో కుత్బుల్లాపూర్‌లో రూ.6 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వస్తున్నాను. మరొక సారి అవకాశం కల్పిస్తే తప్పకుండా ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతా. ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం కేవలం ఎన్నికల కోసమే అని ప్రజలు గమనించాలి.

ప్రజలకు అండగా ఉంటా

కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్



2009లో నన్ను ప్రజలు స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించారు. వారి అంచనాలకు అనుగుణంగా అప్పట్లో పనులు చేశాను. ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే తప్పకుండా గెలిపిస్తారు అన్న విశ్వాసం ఉంది. కబ్జాలపై నిలదీస్తే ఎమ్మెల్యే వివేకానంద్ నాపైన దాడి చేశారు. రేపు సామాన్యులు సైతం ఇదే పరిస్థితి ఎదుర్కొనే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తమై బిజెపిని గెలిపించాలి.

నిజాయితీగా పని చేస్తా..

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి హన్మంతరెడ్డి



ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నిజాయితీగా పని చేస్తా. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడుతా. నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించి ముందుకు సాగుతా. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో అమలు విషయంపై వచ్చే పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటా. నాకు అవకాశం కల్పించండి.

ఐదేళ్లలో పెరిగిన 1,82,950 మంది ఓటర్లు

రంగారెడ్డినగర్: కుత్బుల్లపూర్ నియోజవకర్గ పరిధిలో 2018లో 5 లక్షల 16వేల 180 మంది ఓటర్లు ఉండగా 2023 అక్టోబరు నాటికి గడ ఐదేళ్లల్లో 1 లక్షా 82 వేల 950 మంది అదనంగా చేరి మొత్తం ఓటర్లు 6.99 లక్షలకు చేరారు. ఈ ఏడాది జనవరి నాటికి ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది జాబితాలో 6,29,619 మంది ఓటర్లు ఉండగా వీరిలో 91,996 మందికి రెండేసి ఓట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు ఇంటింటి సర్వే చేపట్టి సాధ్యమైనంత వరకు డబుల్ ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే పలు దఫాలుగా ఓటర్లుగా నమోదు కావడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించడంతో పాత ఓటర్లకు అదనంగా 1,82,950 మంది కొత్త ఓటర్లు జత కావడంతో ప్రస్తుతం 6,99,130 ఓటర్లకు చేరుకున్నారు.

రేపు కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు

సుభాష్‌నగర్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 7గంటలకు అభిషేకాలు, అర్చనలు, ఉదయం 11గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ పేర్కొంది.

సైన్స్ ఎగ్జిబిషన్



విద్యార్థులు తయారు చేసిన నమూనాలు

దుండిగల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలు చేయాలని బౌరంపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాంరెడ్డి అన్నారు. పాఠశాలలో శనివారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నేతృత్వంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మదన్ రెడ్డి, ప్రదీప్ రావు, రాజేష్, పద్మప్రియ ధనరాజ్, రాజేందర్, రమా కుమారి, గీత సదాలక్ష్మి, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సభ్యులు అపర్ణ సౌజన్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



విద్యార్థులతో ప్రముఖ గాయనీ గీతా మాధురి

దుండిగల్: చిన్నతనం నుంచే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ప్రముఖ గాయని గీతా మాధురి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్‌లో షాన్ కేర్ ఫౌండేషన్ సహకారంతో టూన్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గీతా మాధురి ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. పిల్లలతో కలిసి ఆడి పాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పబ్లిక్ స్పీకింగ్, చమత్కార కార్టూన్ల ఉపశీర్షికలు, క్లే మోడలింగ్, కామిక్ రీల్స్ తదితర పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్కిడ్స్ స్కూల్ వీపీ అకడమిక్స్ డాక్టర్ కవితా నాగ్పాల్, షాన్ కేర్ ఫౌండేషన్ ఫౌండర్ అగాప్ డోర్కస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత




కైసర్‌నగర్ సర్వే నం.324లో కూల్చివేసిన గది

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్ నగర్ సర్వే నంబర్ 324లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. 324లో పలు నిర్మాణాలు చేపడుతున్నారని సమాచారం రావడంతో తహసీల్దార్ రెహమాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీ కాంత్ నేతృత్వంలో శనివారం సిబ్బంది జేసీబీతో మూడు గదులను నేలమట్టం చేశారు.

బీజేపీ గెలిస్తే బీసీ సీఎం

• జనసేన అధినేత పవన్‌కల్యాణ్ • కుత్బుల్లాపూర్‌లో కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించాలని అభ్యర్థన







కుత్బుల్లాపూర్‌లో ప్రచారానికి వచ్చిన పవన్‌కల్యాణ్‌తో కూన శ్రీశైలంగౌడ్. భారీగా హాజరైన జనం



నిజాంపేట్: తెలంగాణలో అవినీతిమయ పాలనను అంతమొందించడానికి బీజేపీ, జనసేన పార్టీలు కలిసి ఎన్నికల బరిలో నిలిచాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ వద్ద జరిగిన రోడ్ షోలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారన్నారు. కుత్బుల్లాపూర్‌లో బలమైన నాయకుడు, బీసీ వర్గానికి చెందిన కూన శ్రీశైలంగౌడ్‌ను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. జనసేన, బీజేపీ నాయకులు కలిసికట్టుగా పని చేసి కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించుకోవాలన్నారు.

◆ దేశానికి బలమైన న్యాయకత్వం అవసరమని, అది ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు. ముంబాయిపై ఉగ్రవాదులు దాడి చేసి హత్యాకాండ సృష్టించారని నేడు నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం వైపు చూసేందుకు శత్రుదేశాలు భయపడుతున్నాయని అన్నారు. ఎందరో ఆత్మ బలిదానాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ నగరం ఒక్కటే కాదని.. అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి సాధించాలన్నారు.

◆ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడితే బంగారు తెలంగాణ సాకారమవుతుందన్నారు. దేశ భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీతో కలిసి జనసేన పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతి సాధ్యపడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో యువతకు ఉపాధి ఉద్యోగవకాశాలు, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా చేపట్టేందుకు వీలవుతుందన్నారు.

◆ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో జనసేన కార్యకర్తలు, అభిమానులు కుత్బుల్లాపూర్‌లో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు ఓటేయాలన్నారు. బీజేపీకి ఓటేస్తే జనసేనకు ఓటేసినట్లేనని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజల మనిషి కూన శ్రీశైలంగౌడ్‌కు గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవముందని అన్నారు. ఆయనను గెలిపిస్తే కుత్బుల్లాపూర్ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందన్నారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. పవన్‌కళల్యాణ్ చివరిగా భారత్ మాతాకీ జై, జైహింద్ అని నినాదాలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది.



రోడ్‌షోలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్



బీజేపీ అభ్యర్థి కూన శ్రీశాలంగౌడ్‌ను గజమాలతో సత్కరించిన అభిమానులు



భారీగా హాజరైన కార్యకర్తలు, అభిమానులు





కూన శ్రీశైలంగౌడ్‌ను దీవిస్తున్న ఓ మహిళా అభిమాని

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం..

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి



మిథులా నగర్ కాలనీ వాసులతో సమావేశమైన కొలన్ హన్మంతరెడ్డి



సాయినగర్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ బైక్ ర్యాలీ దృశ్యం

నిజాంపేట్: నిరంకుశ బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడే రోజుల్లో దగ్గర్లోనే ఉన్నాయని.. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కౌలస్య కాలనీ మీదుగా బాచుపల్లి అంబేద్కర్‌నగర్ వరకు ర్యాలీ కొనసాగగా, అనంతరం సాయినగర్ కాలనీలో జరిగిన రోడ్‌షోలో హన్మంతరెడ్డి మాట్లాడుతూ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రజల ఆశీర్వాదంతో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేగా గెలువనున్నానని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు పరిచి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు.

◆ నిజాంపేట పరిధిలోని మిధులానగర్‌లో గుడ్ మార్నింగ్(బ్రేక్ ఫాస్ట్) కార్యక్రమంలో భాగంగా కాలనీని సందర్శించిన హన్మంతరెడ్డి స్థానికంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, పందులు, కుక్కలు బెడద తదితర సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

◆ సుభాష్‌నగర్ డివిజన్ కృషి కాలనీ, సాయిబాబా నగర్, సూరారం పరిధిలో జరిగిన ఐఎన్‌టీయుసీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పోలయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, రమేష్ చింతల్, హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కుంజ శ్రీనివాస్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

– గాజులరామారం డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్‌లో జరిగిన మైనార్టీల సమావేశంలో హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడగానే రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు.



బాచుపల్లిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి



సూరారంలో ఐఎన్‌టీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి



వల్లభాయ్ పటేల్‌నగర్‌లో మైనార్టీల సమావేశంలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి

బీఆర్‌ఎస్‌కే అందరి మద్దతు

కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న మహిళలు



సుభాష్‌నగర్ డివిజన్‌లో ప్రచారంలో పాల్గొన్న వివేకానంద్

కుత్బుల్లాపూర్: మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజల్లో అదరణ లేదని, అన్ని వర్గాల సంక్షేమం కోరుకునే బీఆర్‌ఎస్‌కే అందరు మద్దతు ప్రకటిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

◆ రంగారెడ్డి నగర్ డివిజన్ ఇందిరాగాంధీ నగర్, సుమిత్ర నగర్, గిరి నగర్, బీజేఆర్ నగర్, రంగారెడ్డి నగర్, ఓం జెండా, పంచశీల కాలనీ, జీ శాన్ బస్తీ, దావూద్ బస్తీ, వెంకటరామిరెడ్డి నగర్, విజయనగర్ కాలనీ, నందానగర్ ప్రాంతాల్లో వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

◆ టిటిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మద్దూరి సాయి తులసీ తన పదవికి రాజీనామా చేశారు. వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జి.హేమలత సురేష్‌రెడ్డి, ఫిషరీస్ కో–ఆపరేటివ్ మేడ్చల్ జిల్లా చైర్మన్ మన్నె రాజు పాల్గొన్నారు.

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ సాయిబాబా నగర్ ఫేస్–2 కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పాల సత్యనారాయణ వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, కౌన్సిలర్ జంధా మంజుల తదితరులు పాల్గొన్నారు.

◆ సుభాష్ నగర్ డివిజన్ హమీద్ బస్తీ, శ్రీను బస్తీ, పాండు బస్తీ, ప్రియాంక నగర్, ముత్తయ్య నగర్, తెలుగు తల్లి నగర్‌ల్లో వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. క్రాంతి ఆధ్వర్యంలో దాదాపు 50 మంది వివేకానంద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

◆ సూరారం డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో వివేకానంద్ పాల్గొన్నారు. శ్రీరామ్‌కాలనీకి చెందిన కె.శివరాం రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 50 మంది యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు...

◆ వివేకానంద్ అభ్యర్థిత్వానికి బలపరుస్తూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఏకగ్రీవ తీర్మానం చేశారు.



బతుకమ్మలతో స్వాగతం పలుకుతూ..



వివేకానంద్‌ను సత్కరిస్తూ..



ఏకగ్రీవ తీర్మానాలను ఎమ్మెల్యే వివేకానంద్‌కు అందజేస్తూ..